# ఓ రోజు వస్తుంది!

మిట్టమధ్యాహ్నం! ఎండ ఎర్రగా మిడిసిపడుతోంది.

పద్మ చాలాసేపటినుంచి వీధిలోకి చూస్తూ గుమ్మం దగ్గరే నుంచుంది. ఉన్నట్టుండి పద్మ కళ్ళల్లోంచి వెలుగు పుట్టుకొచ్చి మొహమంతా పాకింది. ఆశగా ఒక్క అడుగు ముందుకు వేసింది. పోస్టు జవాను యింటి ముందుకు వచ్చినట్టే వచ్చి నాలుగంగల్లో యిల్లుదాటి వెళ్ళిపోయాడు. అతని వీపుమీద బరువుగా వ్రేళ్లాడుతోంది టపా సంచి. అందులో ఒక్క ఉత్తరంకూడా లేదు తనకి. క్రమంగా పద్మ మొహంలో ఆశ అంతరించి యథా ప్రకారంగా దిగులు అలుముకుంది. ఇప్పట్లో తనకు ఉత్తరం రాదన్న సంగతికూడా తెలుసు.

దాయాదులు అక్రమంగా వేసిన దావాలో రెండో కోర్టునుంచికూడా పరాజితులై ఆస్తిఅంతా పోగొట్టుకున్న పుట్టింటివాళ్ళు పండక్కి కూతుర్నీ, అల్లుణ్ణీ పిల్చుకెళ్ళేంత సంతోషంలో లేరు. "అయితేమాత్రం లాంఛనంగా ఒక్క ఉత్తరంముక్క రాస్తే ఏం పోయింది? అంతమాత్రాన ఎవరు బయల్దేరటానికి సిద్ధంగా వుండిపోయారు?" అనుకుంది విరక్తిగా.

పోస్టుజవాను నడిచిపోవటం అత్తగారు చూడనేచూసింది. "ఎందుకలా నించున్నావు? రోజుకో జాబు పంపుతారనా ఏమిటి ఎదురు చూడ్డం? లోపలికి వెళ్ళి పప్పు రుబ్బరాదూ?" అంటూ విదిలించుకొంటూ వెళ్ళిపోయింది.

పద్మ అయిష్టంగా లోపలికి వెళ్ళింది. పప్పుగిన్నె తీసుకువచ్చి రోటిముందు కూర్చుంది.

కోడరికం అనేమాటకి పద్మ అత్తింటి కాపురాన్ని కొంతవరకూ నిదర్శనంగా ఎంచుకోవచ్చు. పెళ్ళయిన ఐదారేళ్ళ లోనూ పద్మ ఒక రకంగా ఆ పల్లెటూరు చాకిరీకి అంకితమైపోయింది. అత్తా ఆడబిడ్డల దెప్పుళ్ళకు అలవాటు పడిపోయింది.

ఒక ఆడది మరో ఆడదాన్ని ఎంత ద్వేషించగలదో అంతా ద్వేషిస్తుంది కోడల్ని పద్మ అత్తగారు. కారణం ఏమీలేదు. తను అత్తగారై తనకీ ఓ కోడలు రావటం. మరీ కారణం ఆలోచించాలంటే వియ్యాలవారి బీదతనం. అనుకున్న ప్రకారం కట్నాలూ కానుకలూ చెల్లించలేకపోవటం— పైగా అందంగా కూతుర్నీ, అల్లుణ్ణీ నాలుగు నెల్లకోసారైనా పిల్చుకు వెళ్ళలేకపోవటం.

ఆ నిత్య నరకంలో పద్మకు కన్పించే ఒక్క ఆశాకిరణం శంకరం మంచితనం. "బీదతనానికి సానుభూతి చూపించాల్సిందేగానీ అపహాస్యాలు చేయటం ధర్మంకాదు" అంటాడతను పద్మతో.

ఆ రెండు మాటలూ పద్మకో కొండ పెట్టు. పద్మ చదువుకున్నది. అయినా అత్తింట అడుగు పెట్టిన దగ్గర్నుంచీ ఆ చదువు సంధ్యలకు తిలోదకాలివ్వక తప్పలేదు. పద్మ చేతుల్లో ఏదైనా పుస్తకం కన్పిస్తేచాలు అత్తగారు మొహం చిట్లించుకుంటుంది. "సంసార్ల యిళ్ళల్లో అల్లాంటి కథలూ కవిత్వాలూ సాగవమ్మాయ్? లేచి బియ్యం ఏరరాదూ?

ఆనక ఆదరా బాదరా చేస్తావు. పంటి కింద రాయిపడితే మామగారు వూరుకోరు. అయినా నా వెర్రిగానీ అసలు కట్టుకున్నవాడు ఆఁ అనాలా? వూఁ అనాలా? పెంపుడు కుక్కమల్లే వెనకాతల తిరుగుతోంటే ఎన్నిసోకులు పోయినా పోవచ్చు.

"నాకు తెలీకడుగుతాను! ఇంత సదూకున్న కుర్రదానివి, ఏ పట్నం వుద్యోగస్థుడికో యిచ్చి పెళ్ళిచేస్తే... మా కన్నా పిచ్చివాళ్ళెక్కడ దొరుకుతార్లే! ముందు మాయ మాటలు నమ్మి తర్వాత ఎంత మొత్తుకుంటేమాత్రం ఏం లాభం? ఓ అచ్చటా? ముచ్చటా? అల్లుడికి అందంతీరిందా? ఆడబిడకి అందం తీరిందా? వియ్యాపురాలికి... సరే! ఇక నా మొహానికా?..." ఆ ప్రవాహానికి మరి అంతువుండదు. అప్పటికే పద్మ కళ్ళనిండా నీళ్ళు వూరి – పుస్తకంలో అక్షరాలు అల్లుకుపోయి కంఠంనిండా దుఃఖం పూడి మరి చదువు సాగదు.

క్రమంగా ఆ పత్రికలు కొనుక్కునే తాహతుకూడా పోయింది. వారానికో పావలా అంటే ఎలా వస్తుంది పద్మకి?

తన చదువుగురించి ఆలోచించటం ఏనాడో మానేసింది. నాలుగేళ్ళ సూర్యానికి తెలుగువాచకం కొనాలన్నదే పెద్ద ఆలోచనైపోయింది. సూర్యం చాలా నెమ్మదైనవాడు. కొన్నపలక కొన్నట్టు గానే వుంచుకుని అక్షరాలన్నీ నేర్చుకున్నాడు. "అమ్మా! మా మేష్టారు పుస్తకం తెచ్చుకోమన్నారమ్మా!" అన్నాడు. పద్మకి గంపెడు ఆనందం, పుట్టెడు దుఃఖం కలగలుపుగా ముంచు కొచ్చాయి. "అలాగే నాన్నా!" అంది.

ఆ సంగతి భర్తకి చెప్పలేదు. ఆయన విని ప్రయోజనం వుండదని పద్మకు తెలుసు. శంకరంచేతిలో ఒక్క పైసా కూడా వుండదు. రోజస్తమానం పొలంలో పని– తండ్రి పురమాయించిన విధంగా తను చేస్తూ పాలేళ్ళతో చేయించటం. డబ్బు తాలూకు జమా ఖర్చులు తండ్రి చూసుకుంటాడు. ఆ ఇంటిపెద్ద ఆజ్ఞలేకుండా ఓ గ్లాసు మంచినీళ్ళుకూడా యివ్వబడవు. చాలాసార్లు శంకరానికి తన దగ్గరున్న డబ్బులిచ్చి స్నేహితులతో రెండో ఆట సినిమాలకు పంపేది పద్మ. ఆ రోజులన్నీ ఓ కలలా వున్నాయి. అప్పట్లా అమ్మని అడగటానికికూడా పద్మకు మనస్కరించటంలేదు.

పిండి రుబ్బుతూ సూర్యంగురించే ఆలోచించింది పద్మ. వాళ్ళ నాన్నదగ్గిర కూర్చుని అట్లు తింటూ సూర్యం అనేశాడు– "నాన్నా! నాకు పుస్తకం కొనమంటే అమ్మ కొనటం లేదు. నువ్వు కొనవా నాన్నా? మా మేష్టారు తెచ్చుకోమన్నారుగా!"

శంకరం పద్మ మొహంలోకి చూడబోయాడు. పద్మ విననట్టు మొహం తిప్పుకుంది.

కొంతసేపటికి కొడుకుని బుజ్జగిస్తూ– "తాతయ్యని అడుగు. కొంటాడు" అన్నాడు.

సూర్యం దడుస్తోన్నవాడిలా నించున్నాడు.

"ఫర్వాలేదు పద. నేను గుమ్మందాకా వస్తాను. నువ్వే అడుగు తాతయ్య కొంటాడు." అంటూ సూర్యం చెయ్యి పట్టుకు తీసుకువెళ్ళాడు శంకరం.

తాతయ్య నులకమంచం మీద కూర్చుని చుట్ట చుట్టు కొంటున్నాడు. సూర్యం అడుగులో అడుగు వేసుకొంటూ వెళ్ళాడు. "తాతయ్యా!"

"ఏంరా? ఏంటానసుగుడు?"

"మరేమో !...నాకేమో...మా మేష్టారేమో... పలక...పలక...కాదు తాతయ్య! పుస్తకం...ఒకటోక్లాసు పుస్తకం తెచ్చుకోమన్నారుగా?"

"ఊ! అయితే తీసికెళ్ళు."

"మరి లేదుగా? నువ్వు కొంటావా?"

"కొంటాను, కొంటాను మరేంపని లేదు, నీ పుస్తకం కోసం రానూ పోనూ ఖర్చుపెట్టి టౌన్ వెళ్తాను. అప్పుడే పుస్తకాలూ, గ్రంథాలూను చించి పోగులు పెట్టటానికా?

బిక్క మొహంతో అలాగే నించున్నాడు సూర్యం.

నించుని నించుని...ఒక్కసారిగా పరిగెత్తుకువెళ్ళి తల్లి కుచ్చెళ్ళలో మొహం దాచుకుని బావురుమన్నాడు.

శంకరం విసురుగా గదిలోకి వచ్చాడు. "ఛీ! దుర్మార్గుడు! చచ్చేటప్పుడు డబ్బు మూటలు తీసుకుపోతాడు."

పద్మ ఆశ్చర్యంగా చూసింది. శంకరం ఎన్నడూ అంత బాధ వెల్లడించలేదు - అతని కలా బాధపడటం చేతనైనందుకు ఎంతో సంతోషం కలిగినట్టయింది.

రోజూ పోస్టుకోసం ఎదురుచూస్తూనేవుంది పద్మ. నాలుగో నాడు - వుత్తరంతో పాటు చిన్న పార్శిల్ కూడా

యిచ్చి వెళ్ళాడు జవాను - సూర్యానికి యింకో తాతయ్య తెలుగు వాచకం పంపించాడు. సూర్యం సంబరంగా పుస్తకం విప్పి అక్షరాలు కూడ బలుక్కుని చదువుతూ కూర్చున్నాడు-

అసలు ప్రసక్తి ఎత్తాలనే వుద్దేశ్యంతో,

"అదెక్కడిదిరా?" అంది నాయనమ్మ ఏమీ ఎరగనట్టు.

"ఈ తాతయ్య కొనలేదుగా, మా తాతయ్య పంపించాడు."

పద్మ బియ్యం ఏరుతూ కూర్చుంది అత్తగారికేసి చూడకుండా.

కొంగు పర్చుకుని పడుకున్న అత్తగారు కాస్త లేచి కూర్చుంది. "అయితే మీ నాన్నకెలా తెలిసిందీ?" అంది రాగం తీస్తూ.

పుస్తకం పంపించమని పద్మ రాసినమాట నిజమే. అది చెప్పాల్సిన అవసరమేం కన్పించలేదు.

"ఎందుకు తెలీదూ! వాడికి అక్షరాలన్నీ వచ్చేశాయని నేనే రాశాను. ఆయన ఊహించుకుని పంపి వుంటారు."

"ఊహించాడు...వూహా...ముష్టి మూడణాల పుస్తకం కాబట్టి గొప్పగా పంపించాడు. పండక్కి అల్లుడికి పంచెల చాపు పంపించలేక పోయాడూ? కూతురికి ఓ కోకగుడ్డ పంపించలేకపోయాడూ? సిగ్గు లేకపోతేసరి. మహా పంపించాడు...పు.. స్త...కం"

పద్మకి ఎన్నడూ రానంత దుఃఖం వచ్చేసింది. అమ్మ పెట్టా పెట్టదు. అడుక్కు తినానివ్వదని — కోడలికి ఆ మాత్రం ఆదుకోగలిగేవాళ్ళెవరైనా వున్నారంటే ఆ అత్తకి చిటపట లాడినట్టే వుంది_పొలంనుంచి తండ్రీ కొడుకులు వచ్చాక కూడా ఓ రాద్ధాంతం అయింది.

శంకరం గబగబా పద్మ దగ్గరికి వెళ్ళాడు. పద్మ కళ్ళు తుడుచుకుని నించుంది.

"ఏడుస్తున్నావా పద్మా!"

"ఊహు!"

"నేను వుండగాకూడా నువ్వు ఏడవాలా పద్మా?" నిష్ఠూరంగా ధ్వనించింది శంకరం కంఠం.

పద్మ తప్పు చేసినదానిలా తల దించుకొంది.

"నేను అప్రయోజకుణ్ణి పద్మా!"

తెల్లబోయింది పద్మ.

"నిజమే. నే నెందుకూ పనికిరాను. హాయిగా చదువుకుని వృద్ధిలోకి రావాల్సిన రోజుల్లో ఆకతాయిగా తిరిగి భవిష్యత్తు సర్వనాశనం చేసుకున్నాను. అది చాలక నా కడుపు నింపుకోలేని నేను పెళ్ళికూడా చేసుకుని బిడ్డల్ని కంటున్నాను. నా పొరపాటు నిజంగా యివ్వాళ అర్థమౌతోంది నాకు."

పద్మ మనసు కరిగి నీరైంది.

"ఛీ! మీ రెప్పుడూ అలా అనుకోవద్దు. పెద్దచదువు చదివి పట్నంలో వుద్యోగం చెయ్యకపోవటం అప్రయోజ

కత్వం కాదు. రైతుబిడ్డగా భూమాతను నమ్మి బ్రతుకుతున్న మీ విలువ మీ తల్లిదండ్రులే గ్రహించటం లేదు. ఈనాటికి మీలో చైతన్యం కల్గింది ఇన్నాళ్ళుగా అదే నేను కోరు కున్నాను. ఇన్నాళ్ళూ చేతగాని తనమే ఈ శాంతానికి మారు పేరేమో అనుకున్న నాకుకూడా కనువిప్పే అయింది. మనం ఆత్మాభిమానంతో బ్రతికితే యిలాంటి కష్టనిష్ఠూరాలు ఏమీ చెయ్యలేవు. తప్పకుండా ఓ రోజు వస్తుంది మనం సుఖ పడటానికి" పద్మ కన్నీరు విచిత్రంగా మెరిసింది.

(కరుణామయినుంచి)